క్లుప్తంగా

ఘనంగా బతుకమ్మ సంబరాలు



కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆట పాటలు ఆడారు. అనంతరం సమీపంలోని ఊరకుంటలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడికి సన్మానం

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల సమీపంలో ఉన్న సూర్యలత కాటన్‌మిల్ గుర్తింపు సంఘానికి జరిగిన ఎన్నికల్లో సూర్యప్రకాష్ రావు గెలుపొందారు. శనివారం ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, భగత్ సింగ్, గణేష్, కిశోర్, రామకృష్ణ, శ్రీశైలంయాదవ్, అల్లుడుకృష్ణ తదితరులు ఉన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు



చారకొండ: లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతునట్లు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఆర్ఐ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు సిర్సనగండ్లలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కార్యదర్శులు గణేష్, సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చారకొండ: మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన బాదగోని మల్లమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

అనాథ పిల్లలకు దుస్తులు అందజేత

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణ శివారులో సరస్వతి వాత్సల్య మందిర్ అనాథ విద్యార్థులకు పట్టువస్త్రాలను ఉపాధ్యాయుడు గోపాలస్వామి శుక్రవారం అందజేశారు. సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టైలరింగ్ ఇనిస్టిట్యూట్ వారు ఉచితంగా స్టిచింగ్ చేసినట్లు ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరి సీతామహాలక్ష్మి తెలిపారు.

ఆర్థికసాయం..

చారకొండ: మండల కేంద్రానికి చెందిన మారుపాకుల(పల్చ) రాజు కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఉన్నాడు. గ్రామానికి చెందిన రాష్ట్ర బీజేపీ మహిళ మోర్చా అధికార ప్రతినిధి తిరుమల లావణ్య శుక్రవారం బాధితుడిని పరామర్శించారు. శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్చ రాజుకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. యువకులు, మహిళలు ఉన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ సత్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం ఆటోలో కొట్ర గ్రామానికి చెందిన ముంగలిశెట్టి శేఖర్, కృష్ణయ్యలు కల్వకుర్తి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ సత్యం ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శేఖర్, కృష్ణయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. శేఖర్ భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న కుటుంబ డిజిటల్ కార్డు సర్వే

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం ప్రతి కుటుంబానికి కుటుంబ డిజిటల్ కార్డు కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన దేవినేనిపల్లిలో రెండో రోజు శుక్రవారం అధికారులు సర్వే చేపట్టారు. ప్రతి కుటుంబంలో ఉన్న సభ్యులను డిజిటల్ కార్డు కోసం వివరాలను సేకరించి కుటుంబ సభ్యుల ఫొటోలను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేందర్, పంచాయతీ కార్యదర్శి దేవ తదితరులు పాల్గొన్నారు.



అమ్రాబాద్ అమరేశ్వర ఆలయంలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



తెలకపల్లిలో..



కల్వకుర్తి వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో..

గాయత్రీదేవిగా అమ్మవారు



అచ్చంపేట వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



తాడూరులో..



పెద్దకొత్తపల్లిలో..



కొల్లాపూర్‌లో ధనలక్ష్మీదేవిగా..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిశుక్రవారం గాయత్రీదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొల్లాపూర్ వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మిగా కొలిచారు. రూ.50 లక్షల నగదుతో అలంకరించారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత ధనలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. రూ.20 లక్షలతో అమ్మవారిని అలంకరించారు. కొల్లాపూర్, అచ్చంపేట, కోడేరు, తాడూరు, పెద్దకొత్తపల్లి, పెద్దకార్పాముల, దేవల్‌తిరుమలాపూర్, అమ్రాబాద్, పదర మండలాలు, తెలకపల్లిలోని శ్రీముఖ దుర్గాదేవి ఆలయం వద్ద, దోమలపెంట, మన్ననూరు, ఉప్పునుంతల, లింగాలలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదానాలు, హోమాలు, కుంకుమార్చనలు చేశారు.



దోమలపెంటలో..



లింగాలలో



మన్ననూర్‌లో..



కోడేరు మండలం నర్సాయిపల్లిలో..



తాడూరు మండలం పాపగల్‌లో..



ఉప్పునుంతలలో..

మొక్కలను పరిరక్షించుకుందాం



నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): నాటిన మొక్కలను పరిరక్షించుకుందామని డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం తిమ్మాజీపేట మండలంలోని ఇప్పలపల్లిలో రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీలు మొక్కల మొదలు వద్ద కలుపు లేకుండా చూడాలని సూచించారు. నీటి మడి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయానికి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పనులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. ఎంపీడీఓ రాములునాయక్, ఏపీఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై కళాజాతా



లింగాల: మండలంలోని రాయవరంలో శుక్రవారం బ్యాంక్ సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ కళాజాతా కర్నూల్ బృందం బ్యాంక్ పథకాలపై ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కేంద్రం అమలు చేస్తున్న బ్యాంకింగ్ పథకాలు వివరించారు. ప్రస్తుతం డిజిటల్ బ్యాంకింగ్ సేవలను తెలిపారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం లింగాల కౌన్సిలర్లు మన్సూర్, రూపేష్, శ్రీశైలం, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. రోడ్లు జలమయం



కల్వకుర్తి టౌన్: పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వర్షం కురిసింది. మున్సిపాలిటీలోని 7వ వార్డులో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. గాంధీనగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల ఎదుట నీరు నిల్వడంతో ఇబ్బందులు పడ్డారు. పట్టణం నుంచి మండలంలోని ఎల్లికల్‌కు వెళ్లే దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు అవస్థలు పడ్డారు. వర్షం నీరు నిల్వకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్‌ను వివరణ అడగగా త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్లాట్లను విధిగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలి

ఉప్పునుంతల: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లలో ప్లాట్లను కొనుగోలు చేసిన వారు విధిగా ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యూలేషన్ స్కీం) చేసుకోవాలని ఎంపీఓ నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉప్పునుంతల, వెల్టూరు, కంసానిపల్లి, మామిళ్లపల్లి, ఫిరట్వానిపల్లి, రాయిచెడ్, అయ్యవారిపల్లి గ్రామాల పరిధిలో చేసిన లే అవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు కార్యదర్శులను సంప్రదించాలని పేర్కొన్నారు. ప్లాట్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు, ఈసీలు, అవసరమైన పత్రాలు చూపించి ఈ నెల 30 వరకు ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని ఎంపీఓ కోరారు.

బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

మన్ననూర్: స్థానిక ఎస్‌బీఐ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎంలో గోల్‌మాల్‌కు(అవకతవకలు) బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏటీఎం వినియోగదారులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల కిందట వినియోగదారులైన జీసీసీ ఉద్యోగి రాములు, మన్ననూర్ గ్రామానికి చెందిన రాజులు ఏటీఎం ద్వారా డబ్బులు విత్ డ్రా చేసుకునేందుకు వెళ్లారు. మిషన్ నుంచి రూ.500 నోటుకు బదులు రూ.20ల నోటు, అదేవిధంగా రూ. 100 బదులు రూ.10 నోట్లు రావడంతో అవాక్కయ్యారు. బాధితులు సంబంధిత బ్యాంకు మేనేజర్ రాములు నాయక్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు ఉద్యోగులు కమీషన్ల కోసం బ్రోకర్లతో బ్యాంకు లావాదేవీలు నడిపిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలలుగా బ్యాంకులో ఓ ఉన్నత స్థానంలో ఉన్న ఉద్యోగి అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని కోరారు.

విద్యార్థినిపై వేధింపులు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్ ఓ విద్యార్థినిని అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధిస్తున్న ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినితో అదే కళాశాలలో పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్ అసభ్యకరంగా మాట్లాడుతూ తరుచుగా వేధిస్తున్నాడని శుక్రవారం కుటుంబసభ్యులు షీటీంకు ఫిర్యాదు చేశారు. షీటీం అధికారి వెంకటయ్య బాలిక నుంచి వివరాలు సేకరించారు. ఈ విషయమై షీటీం అధికారి వెంకటయ్యను వివరణ కోరగా విద్యార్థిని నుంచి ఫిర్యాదు స్వీకరించామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రికార్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థినితోపాటు మరో ఇద్దరితో కూడా అసభ్యకరంగా మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయని వివరించారు.

నేడు బతుకమ్మ వేడుకలు

బల్మూర్: మండలంలోని చెన్నారంలో శనివారం బహుజన బతుకమ్మ వేడుక నిర్వహించనున్నట్లు బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశన్న యాదవ్ శుక్రవారం తెలిపారు.

గెలుపోటములు సహజం



కల్వకుర్తిరూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో జల్సా టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, నాయకులు ఉన్నారు.

గంజాయి పట్టివేత



కొల్లాపూర్: మండలంలోని సోమశిలలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రెడ్డిగారి మల్లయ్య నుంచి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. గంజాయి సప్లయ్, విక్రయాలపై ప్రత్యేక టీంలను ఏర్పాటుచేసి, తనిఖీలు కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ హనుమంతు ఉన్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సంకల్ప ఫర్టిలైజర్ దుకాణంలో మండలంలోని చర్లిటిక్యాల గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు సీజ్ వరి విత్తనాలను కొనుగోలు చేశారు. 20 ఎకరాలలో సాగు చేశారు. నాణ్యమైన సర్టిఫైడ్ విత్తనాలను సాగు చేస్తే 90 రోజుల్లో వరి పంట చేతికందుతుంది. కాని రామకృష్ణ సీడ్స్ సాగు చేసిన వరి పంట 60 రోజులకే నాసికరంగా పంట చేతికందింది. నకిలీ విత్తనాలతో మోసపోయామని భావించి గురువారం సంకల్ప ఫర్టిలైజర్ దుకాణం ఎదుట గ్రామానికి చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన అధికారులు, కంపెనీ ప్రతినిధులు హుటాహుటిన శుక్రవారం పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఏడీఏ వాసు, నాగర్‌కర్నూల్ ఏఓ రాజుతోపాటు కంపెనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పంట సాగును పరిశీలించి రైతుల వద్ద వివరాలను సేకరించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు డీఎం ఉమాశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. 24 గంటలకు ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ రుసుము రూ. 40 లు ధర నిర్ణయించినట్లు వివరించారు. వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇష్టానుసారంగా పార్కింగ్ చేయొద్దని ప్రయాణికులకు సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టాలి

బల్మూర్: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన బాణాల ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ రాఘవులుకు గ్రామస్తులు రమేష్, మాజీ సర్పంచ్ విష్ణు, వెంకటయ్య తదితరులు ఫిర్యాదు చేశారు. ఆగస్టులో నిర్వహించిన సామాజిక తనిఖీలో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.1.20 లక్షల అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారని వివరించారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

తెలకపల్లి: బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పర్వతాపూర్‌లో చిల్డ్రన్స్ ఫౌండేషన్ కైలాస్ సత్యార్థి కోనేరు సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు.

నిరుద్యోగభృతి కల్పించాలి

తాడూరు: నిరుద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేర్చాలని శుక్రవారం తహసీల్దార్ కిరణ్మయికి డీహెచ్‌పీఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్, మాలమహానాడు జిల్లా నాయకుడు జెట్టి చంద్రయ్య మాట్లాడుతూ నిరుద్యోగులకు వెంటనే భృతి ఇవ్వాలని కోరారు. గడ్డం మశన్న, లక్ష్మయ్య, పరుశరాం, అర్జున్, యాదయ్యలు పాల్గొన్నారు.

గోరటి నరసింహ ఆరాధనోత్సవాలు

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ గోరటివెంకన్న తండ్రి గోరటి నరసింహ 16వ ఆరాధనోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పూజలు చేశారు. యక్షగాన, రంగస్థల కళాకారులు, అల్లిరాని, సత్యహరిశ్చంద్ర, చింతామని, విరాట పర్వం కళలను ప్రదర్శించారు. ఆధ్యాత్మిక గురువు ఈశ్వరయ్య, ప్రముఖ హార్మోనిస్ట్ నాటక రచయిత వృద్ధకళాకారుడు హనుమంతురెడ్డి, వెంకటపతి కేశవాచారి, బాబుమియా పాల్గొన్నారు.

గోదాంను పరిశీలించిన ఎమ్మెల్యే

బల్మూర్: మండల కేంద్రంలో ఈ నెల 8న మార్కెటింగ్ గోదాంను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభించనున్న సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అదేవిధంగా కొండనాగుల, తుమ్మెన్‌పేట గ్రామాల్లో నిర్మించిన పీఏసీఎస్ గోదాంలు, కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఉన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ